సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 5 । జూలై । 2025

మహనీయుల సేవలు చిరస్మరణీయం

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల: మహనీయుల సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి, తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతులు, జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో రోశయ్య, దొడ్డి కొమురయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్‌రావు, డీఏవో అఫ్జల్‌బేగం, జిల్లా ఉద్యానవనాల అధికారి కేఆర్ లత, ఎల్‌డీఎం మల్లికార్జున్, యాదవ సంఘం నాయకులు జగ్గాని మల్లేశంయాదవ్, కనకయ్య, వీరవేణి మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

రేషన్‌షాప్ సీజ్



సోమారంపేట రేషన్‌షాప్ సీజ్

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని సోమారంపేటలోని ప్రభుత్వ రేషన్ షాప్‌ను శుక్రవారం జిల్లా అధికారులు సీజ్ చేశారు. సోమారంపేట రేషన్‌షాపులో జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయగా నాలుగు క్వింటాళ్ల సన్నబియ్యం తేడా రావడంతో షాపు సీజ్ చేసినట్లు తెలిపారు. సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ అధికారి సత్యనారాయణ, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సెస్ చైర్మన్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న సోమిశెట్టి దశరథం

సిరిసిల్లటౌన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తన పదవికి రాజీనామా చేయాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చిక్కాల రామారావు చైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి వివాదాలకు కేంద్రమవుతున్నారన్నారు. ఆర్‌సీఎస్ రిజిస్టర్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ అనుమతి లేకుండా అనేక నియామకాలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. జిల్లా సహకార అధికారి విచారణ చేపట్టాలని కోరారు. నాయకులు గుజ్జ దేవదాస్, బొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్మాణాల పన్ను వసూలు



రాళ్లబావి వద్ద ఇంటింటికీ రూ.వేయి వసూలు చేస్తున్న ఈవో మారుతిరావు

సిరిసిల్లటౌన్: శ్రీశాల వెంకన్న ఆలయ భూముల్లో ఇండ్లు నిర్మాణాలు చేపట్టిన యజమానుల నుంచి శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు రూ.వేయి చొప్పున వసూలు చేశారు. ఆలయ భూముల్లో నిర్మాణాలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయా ఇంటి యజమానుల నుంచి రుసుం వసూలు చేస్తున్నట్లు ఈవో మారుతిరావు చెప్పారు. దేవాదాయ సిబ్బంది రవీందర్, నాగరాజు, లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పథకంతో నీటి నిల్వలు పెంపు

● డీఆర్డీవో శేషాద్రి



వాటర్‌షెడ్ పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అడవిలో వాటర్‌షెడ్ పథకంతో ఏర్పాటు చేస్తున్న ఊటకుంట, చెక్‌ డ్యాంల నిర్మాణాలతో నీటినిల్వలు పెంపొందుతాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి పేర్కొన్నారు. మండలంలోని రాచర్ల గుండారం, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లోని వాటర్‌షెడ్ పథకంలో భాగంగా చేపట్టిన ఊటకుంట, చెక్‌డ్యాం పనులను శుక్రవారం పరిశీలించారు. ఏపీవో జోగం రాజు, వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ అధికారి శ్రీహరి, ఏపీవో కొమురయ్య, ఇంజినీర్ అర్షద్ పాషా, ఎంఈవో కృష్ణహరి, ప్రత్యేకాధికారి భాస్కర్‌రెడ్డి, టెక్నికల్ అధికారి రమేశ్, సాంకేతిక సహాయకులు రాజు, నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు దేవరాజు, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు

సిరిసిల్ల: రాష్ట్ర వ్యాప్తంగా సమాచార, పౌరసంబంధాల శాఖలో 150 ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో అసిస్టెంట్ పీఆర్‌వో, పబ్లిసిటీ అసిస్టెంట్ పోస్టులు రెండు, ఆఫీస్ సబార్డినేట్ ఒక్క పోస్టును భర్తీ చేయనున్నారు. అసిస్టెంట్ పీఆర్‌వో పోస్టుకు రూ.36,750, పబ్లిసిటీ అసిస్టెంట్‌కు రూ.27,130, ఆఫీస్ సబార్డినేట్‌కు రూ.15,600 వేతనం చెల్లించనున్నారు.

అడుగుకో మడుగు



ఇది చందుర్తి మండలం కిష్టంపేట–బండపల్లి మధ్య లింక్‌రోడ్డు. కిష్టంపేట, జోగాపూర్, రామారావుపల్లి, సనుగుల గ్రామస్తులు కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారికి వెళ్తుంటారు. కిష్టంపేట గ్రామస్తులు పొలాలకు వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. ఇంత ముఖ్యమైన లింక్‌రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారింది.

- అధ్వానంగా లింక్‌రోడ్లు
- అడుగుతీసి వేయలేని వైనం
- వర్షాకాలంలో రెట్టింపు కష్టాలు
- ఇబ్బంది పడుతున్న పల్లెప్రజలు

చందుర్తి/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని లింక్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశాలే ఎక్కువ. ప్రస్తుతం వర్షాలు కొడుతుండడంతో గుంతల్లో నీరు చేరి ఎంత లోతు ఉన్నాయో తెలియక గాయపడుతున్నారు. గత పదేళ్లుగా లింక్‌రోడ్లను పట్టించుకునే వారు లేక పల్లె రహదారులు ఛిద్రమయ్యాయి. గ్రామీణ రహదారుల దుస్థితిపై 'సాక్షి' ఫోకస్.

మంజూరుకాని నిధులు

- చందుర్తి మండలంలో ఐదు లింక్‌రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అత్యంత ప్రధాన్యత గల కిష్టంపేట–బండపల్లిరోడ్డుకు రూ.25 లక్షలు మంజూరైనట్లు 2023లో వేములవాడ అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రకటించారు. అయితే పనులు చేయకపోవడంతో మోకాలు లోతు గుంతలతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తాత్కాలిక మరమ్మతులు చేయించినా వాహనాల తాకిడితో మళ్లీ గుంతలు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. కనీసం పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు కూడా వెళ్లేందుకు కష్టంగా మారింది. అంతేకాకుండా పొలాల వద్దకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా పల్లె రోడ్లు

- చందుర్తి మండలం కిష్టంపేట–కట్టలింగంపేట, గుడిపేట–ఎన్గల్, ఎన్గల్–మామిడిపల్లి, చందుర్తి గచ్చుబావి నుంచి నర్సింగాపూర్, రామన్నపేట–ఆశిరెడ్డిపల్లి లింక్ రోడ్ల పనులు నిధులు లేక మరమ్మతులకు నోచుకోవడం లేదు. పదేళ్లుగా మొరం కూడా పోయకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. కిష్టంపేట–కట్టలింగంపేట రోడ్డు నిర్మిస్తే చందుర్తి మండలంతోపాటు కోనరావుపేట మండలం బావుసాయిపేట, మామిడిపల్లి, నిజామాబాద్, వెంకట్రావ్‌పేట, కోనరావుపేట, మల్కపేట, కనగర్తి గ్రామాల ప్రజలకు కోరుట్ల వెళ్లేందుకు రవాణా మెరుగవుతుంది.
- ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి నారాయణపూర్ మీదుగా సింగారం వెళ్లే రోడ్డుపై అడుగుకో గుంత పడింది. రాచర్ల గొల్లపల్లి– రాజన్నపేట గ్రామాల మధ్య రోడ్డు మరీ దారుణంగా మారింది.
- ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి నుంచి కోనరావుపేట మండలం శివంగాలపల్లి మధ్య అటవీ ప్రాంతంలో దాదాపు మూడు కిలోమీటర్లు తారు రోడ్డు లేక మట్టి రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.
- ముస్తాబాద్ మండలం కొండాపూర్–ఆవునూర్, ఆవునూర్–తంగళ్లపల్లి వెళ్లే రోడ్లు దారుణంగా తయారయ్యాయి.
- వేములవాడ నుంచి బోయినపల్లి మధ్య గల తారురోడ్డు శిథిలమైంది. బోయినపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు సీసీ రోడ్లు లేక పల్లె ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



ఇది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి నారాయణపూర్ మీదుగా సింగారం, బండలింగంపల్లి, ముస్తాబాద్ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ రోడ్డుపై అడుగుకో గుంతపడింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

మరమ్మతు చేయాలి



చందుర్తి గచ్చుబావి నుంచి నర్సింగాపూర్ వరకు ఉపాధిహామీలో పదేళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. నాలుగేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. ఈ రోడ్డు సరిగ్గా లేక వేరేమార్గంలో వెళ్తున్నారు. దీన్ని బాగుచేస్తే దూరభారం తగ్గి రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది.

– పూదూరి దామోదర్‌రెడ్డి, నర్సింగాపూర్

దూరభారం తగ్గుతుంది



కట్టలింగంపేట–కిష్టంపేట లింక్‌రోడ్డును మరమ్మతు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు దూరభారం తగ్గుతుంది. కట్టలింగంపేట, మల్యాల, లింగంపేట ప్రజలకు ఉపయోగపడుతుంది. కిష్టంపేట, జోగాపూర్, రామారవుపల్లి, బండపల్లి గ్రామాలకు రావాలంటే సనుగుల మీదుగా, లేదంటే మర్రిగడ్డ మీదగా తిరిగి వస్తున్నారు.

– యెల్ల దశరథం, కట్టలింగంపేట

పనులు వేగంగా చేపట్టాలి



బండపల్లి–కిష్టంపేట మధ్య లింక్‌రోడ్డుపై రవాణా ఎక్కువగా ఉండడంతో వర్షాకాలంలో పెద్దగా గుంతలు ఏర్పడ్డాయి. కనీసం ద్విచక్రవాహనంపై వెళ్లేందుకు వీలు లేకుండా గుంతలు ఉండడంతో వాహనంపై ఇద్దరం కలిసి వెళ్లడం కష్టంగా ఉంది. యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

– అంబరి నరేశ్, కిష్టంపేట

సమస్యలు పరిష్కరిస్తాం

- వేములవాడ కమిషనర్ అన్వేశ్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన



సాక్షి ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అన్వేశ్

వేములవాడ: మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ అన్వేశ్ పేర్కొన్నారు. శుక్రవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. పట్టణ ప్రజలు తెలిపిన సమస్యలను నోట్ చేసుకున్న కమిషనర్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే ఆయా ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రశ్న : ఓపెన్‌జిమ్‌లో పరికరాలు పాడయ్యాయి. వాటిని బాగుచేయించండి.
– దేవరకొండ ప్రసాద్
కమిషనర్: ఓపెన్‌జిమ్‌లో పరికరాలను తక్షణమే మరమ్మతు చేయిస్తాం. ఓపెన్‌జిమ్‌లు అన్నింటినీ బాగుచేయిస్తాం.

ప్రశ్న : డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు. చెత్తబండ్లు సకాలంలో రావడం లేదు.
– దేవరాజు, గోస్కుల ప్రభాకర్, డాక్టర్ రాధాకృష్ణ, ఎద్ల శ్రీనివాస్, వి.ప్రతాప్
కమిషనర్ : డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బందితో పనులు చేయించి రెండు రోజుల్లో ఇబ్బందులు లేకుండా చూస్తాం. చెత్తబండ్లు రెగ్యులర్‌గా వచ్చేలా చొరవ తీసుకుంటాం. చెత్తను బయట వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి.

ప్రశ్న: రోడ్లు బాగాలేవు. బురద పేరుకుపోతుంది.
– ఎస్.సురేశ్, అజయ్–వరలక్ష్మినగర్, రాజేశం–భగవంతరావునగర్, అద్దెంకి సత్తయ్య–వేములవాడ
కమిషనర్ : కోనాయపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పడిన వరలక్ష్మినగర్‌లో అన్నీ సమస్యలే ఉన్నాయి. రోడ్డుపై కనీసం మొరం లేదా మట్టినైనా పోసేందుకు ప్రయత్నిస్తున్నాం. గుంతల్లో మట్టిపోయిస్తాం. మిగిలిన మట్టిరోడ్లను సీసీ రోడ్లు చేయిస్తాం.

ప్రశ్న : మల్లారం జంక్షన్ వద్ద అన్ని సమస్యలే ఉన్నాయి.
– రవి, కుమార్–నందిచౌరస్తా
కమిషనర్ : మా సిబ్బందిని పంపించి మట్టి డ్రెయినేజీలను వెడల్పు చేయిస్తాం. పెరిగిన మొక్కలను తొలగిస్తాం. కట్టుకాలువ పనులు ముందుకుసాగేలా చొరవ తీసుకుంటాం. శివారుకాలనీలో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం.

ప్రశ్న : మార్కండేయనగర్‌లో మురికినీరు నిలుస్తోంది. పైపులైన్ లీకేజీ ఉంది.
– పిట్టల మనోహర్– అడ్వకేట్
కమిషనర్ : పారిశుధ్య సిబ్బందిని పంపించి మురికినీరు నిల్వకుండా చూస్తాం. పైపులైన్ లీకేజీపై మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి సరిచేయిస్తాం.

ప్రశ్న : నందీశ్వర నుంచి వచ్చే మురికినీటితో ఇబ్బంది పడుతున్నాం.
– వంగల కర్ణ అడ్వకేట్, 17వ వార్డు
కమిషనర్ : శానిటేషన్ సిబ్బందిని పంపించి ఈ సమస్య పునరావృతం కాకుండా చూస్తాం. ఈ ప్రాంతాన్ని ఆలయ పారిశుధ్య విభాగం పరిశీలిస్తుంది. రెండు డిపార్ట్‌మెంట్లు సంయుక్తంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న : వీధిదీపాలు వెలగడం లేదు. చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం.
– సుధీర్‌కుమార్, దేవరకొండ రాజేశ్, శ్రీనివాస్, హమీద్
కమిషనర్ : వీధిదీపాలు ఎప్పటికప్పుడు సెట్ చేస్తున్నాం. వర్షాలు, గాలివానలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలనీల్లో చీకట్లు లేకుండా చూస్తాం.

ప్రశ్న : ఫాగింగ్ చేయడం లేదు. దోమలు పెరుగుతున్నాయి.
– మహేశ్–23వ వార్డు, రాజిరెడ్డి, వాసం భూమేశ్, మార్కండేయనగర్
కమిషనర్ : ప్రతీ శుక్రవారం డ్రై డే చేపడుతున్నాం. మా సిబ్బంది కాలనీల్లోని ప్రతీ ఇంటిని టచ్ చేస్తున్నారు. నీరు నిల్వ ఉండకుండా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ రోజు రెండు వార్డులకు ఫాగింగ్ చేయిస్తున్నాం. దోమలు పెరగకుండా ఆయిల్‌బాల్స్ కూడా వేయిస్తున్నాం.

ప్రశ్న : చేపల మార్కెట్‌తో ఇబ్బంది పడుతున్నాం. ఇక్కడి నుంచి తరలించండి.
– శేఖర్, రమేశ్, రాజు, శ్రీనివాస్
కమిషనర్ : బైపాస్‌రోడ్డులోని చేపల మార్కెట్‌ను త్వరలోనే మరో ప్రాంతానికి తరలించనున్నాం. ఇప్పటికే ఈ సమస్య మా దృష్టికొచ్చింది. తప్పకుండా మరో ప్రాంతానికి తరలించి ప్రజలకు సౌకర్యవంతంగా చేస్తాం.

ప్రశ్న : మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ సవరించండి. చేతిపంపు రిపేర్ చేయించండి.
– అనిల్‌కుమార్, 2వ వార్డు
కమిషనర్ : లీకేజీని సెట్ చేయిస్తాం. ఇప్పటికే రెండుసార్లు రిపేర్ చేయించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. చేతిపంపు రిపేర్ చేయిస్తాం.

ఆదర్శ మహిళా సమాఖ్య సేవలు భేష్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఇల్లంతకుంట ఆదర్శ మహిళా సమాఖ్య సభ్యులు

- జాతీయ అవార్డుకు ఎంపికవడంపై కలెక్టర్ అభినందనలు
- నిరంతర ఆదాయానికి గ్యాస్ ఏజెన్సీ మంజూరు

సిరిసిల్ల: ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య సేవలు భేష్ అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించారు. ఆదర్శ మండల సమాఖ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆత్మనిర్భర్ సంఘాతన్ అవార్డుకు ఎంపికవగా.. శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు బ్యాంకు రుణాలు అందిస్తూ.. సకాలంలో రికవరీ చేయడం బాగుందన్నారు. మండల, గ్రామ స్థాయిలో క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. సమాఖ్యకు నిరంతర ఆదాయానికి గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్డీవో శేషాద్రి, డీపీఎం వంగ రవీందర్, ఏపీఎం వాణి పాల్గొన్నారు.

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గోరింటాలలో లోతువాగు చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. వాగు ప్రాంతాన్ని, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. ఎంపీడీవో రాజేందర్ ఉన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. త్వరగా నిర్మించాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కోనరావుపేట(వేములవాడ): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ సూచించారు. మరిమడ్లలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భావన పంచాల్ తదితరులు ఉన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు పరిశీలన

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇల్లును కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఆర్‌ఐ శివకుమార్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ కోరారు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యాసంస్థలను శుక్రవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల మెడికల్ బిల్లులు క్లియర్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణప్రసాద్‌గౌడ్, నారాయణ, బాల ఎల్లయ్య, గంధ్యాడపు శ్రీనివాస్, నాగరాజు, బాలరాజు, బాలకిషన్, ప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లా నుంచి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు–2025కు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వినోద్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ టీచర్లు దరఖాస్తులను ఈనెల 13లోపు ఆన్‌లైన్‌లో పంపించాలని సూచించారు.

రేపు తొలి ఏకాదశి

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 6న తొలి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రాధాభాయి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్వామికి, అనుబంధ పరివార దేవతలకు ఉదయం అభిషేకం, అర్చనలు, రుక్మిణీ విఠలేశ్వరస్వామికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం, సాయంత్రం 6.30 గంటల నుంచి మహాపూజ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల 6 నుంచి 7 వరకు అఖండ భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



మరిమడ్లలోని పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్
- మరిమడ్ల ఏకలవ్య పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం

కోనరావుపేట(వేములవాడ): విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కోరారు. మండలంలోని మర్రిమడ్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం రూ.5.14కోట్లతో చేపట్టిన అదనపు మౌలిక వసతుల నిర్మాణం పనులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి భూమిపూజ చేశారు. కేంద్రమంత్రికి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనను మంత్రి తిలకించారు. ఏఐ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భావన పంచాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్, ప్రతాప రామకృష్ణ, ఎర్రం మహేశ్, కిష్టస్వామి పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటీ సర్వే చేయాలి

● జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత



పోత్గల్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

సిరిసిల్ల/గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లాలో జ్వరాల నివారణకు ఇంటింటీ సర్వే నిర్వహించి మందులు పంపిణీ చేయాలని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత కోరారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ ఆరోగ్య కేంద్రం, ఆవునూరు ఆరోగ్య ఉపకేంద్రాలు, శుక్రవారం తనిఖీ చేశారు. డ్రై డే తీరును పరిశీలించారు. రజిత మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నీరు నిల్వ ఉంటే లార్వా పెరుగుతుందన్నారు. డ్రై డేలో భాగంగా క్షేత్రస్థాయిలో పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలన్నారు. డీపీవో రాజేందర్, హెచ్‌ఈవో లింగం, సింధూజ, సాయి పాల్గొన్నారు.

చెట్టుకు టైర్ల కవచం !



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని వేములవాడ రహదారిపై ఓ చెట్టు విద్యుత్‌లైన్‌ను తాకకుండా వంగిపోయింది. ఈ రోడ్డులో మిగతా చెట్లను 'సెస్' సిబ్బంది తొలగించగా.. ఈ చెట్టును మాత్రం వదిలేశారు. ఆ చెట్టు విద్యుత్ తీగలను తాకుండా.. వంగిపోయి పెరిగింది. ఈ చెట్టుతో విద్యుత్ తీగలకు, విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకపోవడంతో చెట్టుకొమ్మలను కత్తిరించకుండా వదిలేశారు. మరోవైపు ఈ చెట్టు మొక్కగా ఉండగా.. చుట్టూరా పాడైన టైర్లను వేశారు. దీంతో ఇప్పుడు మొక్కచెట్టుగా మారి మొదలు పెరిగి టైర్లలో బిగుసుకుపోయింది.



చెట్టు వంగిపోయి ఇలా కనిపిస్తుంది.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

జగిత్యాలజోన్: పాతకక్షలతో ఓ కుటుంబంపై హత్యాయత్నం చేసిన ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ శుక్రవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన తోట మహేందర్‌కు, తోట అనిల్, తోట మారుతి, తోటజ్యోతి మధ్య భూ తగదాలున్నాయి. 2019 ఆగస్టు 16న ఇంటివద్ద ఉన్న మహేందర్ కుటుంబసభ్యులపై తోట అనిల్, తోట మారుతి, తోట జ్యోతి మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. మహేందర్ అన్న, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. మహేందర్ తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనపై పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జీవన్ కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేసారు. కోర్టు మానిటరింగ్ అధికారులు కిరణ్‌కుమార్, కె.త్రివేణ్, కేవీ.ప్రసాద్‌లు బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్లు..

మంథని: తాగిన మైకంలో ఇసుకలారీని అతివేగంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్ పడాల శ్రీధర్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డా.టి.శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. మంథని సీఐ రాజు తెలిపిన వివరాలు.. 2021 నవంబర్ 14న మంథని మండలం బిట్టుపల్లి శివారులో రోడ్డు పక్కన నిలబడి ఉన్న చిలువేరి గట్టయ్య, దరుగుల రాయమల్లును ఇసుకలారీ ఢీకొట్టగా మృతిచెందారు. ఈ మేరకు కోర్టులో నేరం రుజువు కావడంతో శ్రీధర్‌కు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని గొల్లపల్లి రోడ్డులో దొంగలించిన ఆటోలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, కిలోన్నర గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని జాంబాగ్ ప్రాంతానికి చెందిన ఎంటీ. అక్తర్ ఇటీవల ఓ ఆటోను దొంగిలించాడు. అందులో శుక్రవారం మధ్యాహ్నం గొల్లపల్లి నుంచి కిలోన్నర గంజాయి తీసుకొస్తున్నారు. మార్గమధ్యలో వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ కరుణాకర్ అనుమానం వచ్చి ఆటోను తనిఖీ చేశారు. అందులో కిలోన్నర గంజాయి పట్టుబడింది. ఆటో, గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

బైక్ చోరీకి యత్నించిన ముగ్గురిపై కేసు

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో ఓ ఇంటి ఎదుట నిలిపిఉన్న బైక్‌ను అపహరించేందుకు యత్నించిన ముగ్గురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలుమారు విజయ్‌యాదవ్ తన బైక్‌ను ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. గురువారం రాత్రి మండలంలోని మద్దులపల్లికి చెందిన తోడెటి మధు, కంబాల రమేశ్, తోడెటి రాకేశ్ బైక్‌ను అపహరించే యత్నం చేశారు. విజయ్‌యాదవ్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంథనిరూరల్: మంథని మండలం నాగేపల్లి శివారులో మంథని- కాటారం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన పాగే శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాస్ తన ద్విచక్రవాహనంపై మంథని నుంచి అడవిసోమన్‌పల్లికి వెళ్తున్న క్రమంలో నాగేపల్లి సమీపంలో లారీ ఢీకొట్టింది. అయితే ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు, వాహనదారులు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

నకిలీ డ్రగ్స్ దందా!

- కరీంనగర్‌లో జోరుగా నకిలీ మందుల విక్రయాలు
- ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ ఏజెన్సీలు
- వేణు ఏజెన్సీ డీలర్‌షిప్ రద్దు చేసిన సన్‌ఫార్మా
- అధికారుల ఉదాసీనతతో పేట్రేగుతున్న మాఫియా



నకిలీగా గుర్తించిన లెవిపిల్-500 ట్యాబ్లెట్లు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కేంద్రంగా డ్రగ్ మాఫియా విచ్చలవిడిగా దందా సాగిస్తోంది. అక్రమ ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. బహిరంగంగానే నకిలీ మందులను రోగులకు అంటగడుతూ అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. కొంతకాలంగా ఈ మాఫియా అధికారుల కళ్లుగప్పి ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీ మందులను తీసుకువచ్చి రిటైల్ వ్యాపారులకు ఇస్తూ రోగులు ప్రాణాపాయ స్థితికి వెళ్లేందుకు కారణమవుతున్నారు. ఈ మందులతో రోగాలు పోవడం దేవుడెరుగు కొత్త రోగాలు వస్తుండడం, ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మందులు నకిలీవో... అసలువో.. అవి రాస్తే ఏం జరుగుతుందో తెలియక డాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది. అధికారుల ఉదాసీనతతోనే డ్రగ్ మాఫియా పేట్రేగిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రముఖ కంపెనీ పేరుతో..

కరీంనగర్‌కు చెందిన వేణు మెడికల్ ఏజెన్సీస్ పక్షవాతం వచ్చిన పేషెంట్లకు వాడే లివిపిల్-500 మెడిసిన్‌ను ప్రముఖ సన్‌ఫార్మా కంపెనీ తయారు చేస్తుండగా, ఆ కంపెనీ నుంచి డీలర్‌షిప్ హక్కును పొందింది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన సదరు ఏజెన్సీ నిర్వాహకులు సన్‌ఫార్మా నుంచి మందులు తెప్పించకుండా అధిక కమిషన్ల కోసం ఉత్తరప్రదేశ్ నుంచి తెప్పిస్తున్నట్లు గత ఏప్రిల్ నెలలో డ్రగ్ అధికారుల విచారణలో తేలింది. ఈ విషయమై సన్‌ఫార్మా కంపెనీకి సమాచారాన్ని అందించడంతో నకిలీదని కంపెనీ ల్యాబ్ రిపోర్టుతో కరీంనగర్ డ్రగ్ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. సన్‌ఫార్మా పంపిణీ చేసిన బ్యాచ్ నంబర్‌కు వేణు ఏజెన్సీలో ఉన్న మందులకు సంబంధం లేకపోకపోవడంతో నకిలీ మందులుగా గుర్తించి సన్‌ఫార్మా డీలర్‌షిప్‌ను రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టారు.

నకిలీ మందుల మూలాలపై దృష్టి

వేణు ఏజెన్సీ ద్వారా సరఫరా అవుతున్న లివిపిల్-500 నకిలీ మెడిసిన్ ఎవరు సరఫరా చేస్తున్నారనే విషయమై డ్రగ్ కంట్రోల్ అథారిటీ ద్వారా ఆరా తీస్తున్నాం. నకిలీ మందులు తయారు చేసే వారితో పాటు వాటిని తెప్పించి విక్రయించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే విధంగా కేసులు నమోదు చేస్తాం. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ మందుల సరఫరాపై ఉపేక్షించేది లేదు.

– కార్తీక్ భరద్వాజ్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్

ఈ మందులు ఎక్కడెక్కడికి వెళ్లాయి

పక్షవాతం వచ్చిన రోగులకు వాడే లివిపిల్-500 నకిలీ మందులను సరఫరా చేస్తున్న వేణు ఏజెన్సీ ఈ మందులను ఎక్కడెక్కడి రిటైల్ మందుల షాపులకు పంపిణీ చేసిందనే విషయంపై డ్రగ్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఒక వేళ రోగులకు చేరితే రోగం తగ్గకపోగా మరింత ముదిరే ప్రమాదముండడంతో లివిపిల్-500 నకిలీ మెడిసిన్ నిలువరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. డ్రగ్ అధికారులు ఫిర్యాదులు వచ్చినప్పుడే తూతూ మంత్రంగా తని ఖీలు చేస్తుండడం, మిగతా సమయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నా యి. ఇది ఒక్క వేణు ఏజెన్సీకి సంబంధించన విషయమే. ఇలాంటి నకిలీ మందులు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు నగరంలో ఉన్నాయని వాటిపై దృష్టిసారించి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- ఇందిరమ్మ ఇండ్ల ఇసుక పక్కదారి
- 13 ట్రాక్టర్లపై కేసు


వెంకటాపూర్‌లో రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని మానేరువాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలించడానికి వాగులోకి దిగిన ట్రాక్టర్లపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఇందిరమ్మ ఇండ్లకు వెంకటాపూర్ నుంచి ఇసుకను తరలించడానికి 33 ట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చారు. అయితే ఉదయం 7 గంటలకే 13 ట్రాక్టర్లను వాగులోకి తీసుకెళ్లి ఇసుకను నింపుతుండగా.. సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి వెళ్లి పోలీసుల సహకారంతో ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. అధికారుల రాకను ముందే తెలుసుకున్న కొందరు ట్రాక్టర్లతోపాటు పరారయ్యారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ ఇసుకను పక్కదారి పట్టించడానికి ట్రాక్టర్ల యాజమానులు సమయం కంటే ముందే వాగులోకి దిగడంతో పట్టుకున్నామన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఏలో సిలబస్‌గా 'లాంగ్ మార్చ్'


పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్ల: రాష్ట్రంలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎంఏ రెండో సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ నవల 'లాంగ్‌మార్చ్' ఎంపికైంది. ఇప్పటికే ఈ నవల ఉస్మానియా యూనివర్సిటీలో సిలబస్‌గా ఉంది. నల్గొండలోని నాగార్జున కళాశాల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం మానవ సంబంధాలపై పెద్దింటి రాసిన 'జిగిరి' నవల పాఠ్యాంశంగా ప్రవేశ పెడుతున్నారు. ఈ నవల ఇప్పటికే 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఈ రెండు నవలలు త్వరలో సినిమాలుగా రానున్నాయి. ఇప్పటికే సినీ నటుడిగా, పాటలు, మాటల రచయితగా గుర్తింపు పొందారు.



పాఠ్యాంశాలైన 'జిగిరి', 'లాంగ్ మార్చ్' నవలలు

పెద్దింటి అశోక్ కుమార్ రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేట వాసి. ప్రస్తుతం సిరిసిల్లలోని రాజీవ్‌నగర్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

మాయమాటలు చెప్పి బంగారంతో ఉడాయించి


మోసపోయిన లక్ష్మి

వీర్నపల్లి(సిరిసిల్ల): గుర్తుతెలియని బిచ్చగాడు మహిళకు మాయమాటలు చెప్పి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిరలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు. అడవిపదిరకు చెందిన చింతల్‌ఠాణం లక్ష్మి శుక్రవారం ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇది గమనించిన ఓ బిచ్చగాడు వచ్చి.. నీ కొడుకుకు ప్రాణగండం ఉందని భయభ్రాంతులకు గురిచేశాడు. అంతేకాకుండా ఇంట్లో నుంచి బియ్యం తీసుకొచ్చి ఇస్తే మంచిగా చేస్తానని నమ్మబలికాడు. భయాందోళనకు గురైన లక్ష్మి కొంత బియ్యాన్ని తీసుకొచ్చి ఆ బిచ్చగాడు చేతిలో పెట్టింది. అంతలోనే ఏదో ఏదో రసాయనంతో కూడుకున్న బొట్టును ఆమె నుదుట పెట్టడంతో.. బిచ్చగాడు ఏం చెబితే అది చేసింది. తన కూతురు పావుతులం బంగారాన్ని ఆ బియ్యంలో వేయమని, గంట తర్వాత ఆ బియ్యానిచూడాలని చెప్పి అక్కడి నుంచి జారుకున్నాడు. కొంత సమయం తర్వాత అనుమానం వచ్చిన లక్ష్మి ఆ బియ్యంలో బంగారం కోసం వెతకగా దొరక్కపోవడంతో లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వారు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి


రాజు (ఫైల్)

ఓదెల: మండలంలోని మల్లికార్జునస్వామి ఆలయ సమీపంలో లారీ ఢీకొని రూపునారాయణపేట గ్రామానికి చెందిన రాపర్తి రాజు (40) మృతిచెందాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాలు.. రాజు కావేరి సీడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఓదెల నుంచి పెగడపల్లికి బైక్‌పై వెళ్తుండగా వెనక నుంచి లారీ ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మృతుడికి భార్య శీరిష, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


నిత్య(ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన కాటిపల్లి నిత్య(21) తన స్నేహితులు కళాశాలలో, హాస్టల్‌లో మానసికంగా వేధించారని, క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిత్య హైదరాబాద్‌లోని రిషి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలలో చదివే వైష్ణవి, సంజన కొద్ది రోజులుగా చదువులో వెనుకబడ్డావని, హేళన చేస్తూ తీవ్ర మానసిక ఇబ్బందులకు గురిచేశారు. మనస్తాపానికి గురై ఈనెల 1న ఇంటికి వచ్చింది. 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. మృతురాలి తండ్రి కాటిపల్లి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

జీడీకే-11 గనిలో కార్మికుడికి గాయాలు


కార్మికుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): రామగుండం డివిజన్-1 పరిధి జీడీకే-11గనిలో జరిగిన ప్రమాదంలో జి.శ్రీకాంత్ అనే బదిలీ వర్కర్‌కు గాయాలయ్యాయి. గనిలోని 15లెవల్ 15రేస్‌లో బ్లాస్టింగ్ కోసం నలుగురు కార్మికులు సపోర్టింగ్ కోసం డ్రిల్లింగ్ చేస్తుండగా ఈప్రమాదం జరిగింది. పైకప్పు సపోర్టింగ్ చేసిన తర్వాతే డ్రిల్లింగ్ చేయాల్సి ఉండగా సేఫ్టీ సరిగా పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. నలుగురు పనిచేస్తున్న ప్రాంతంలో పైకప్పు కూలడంతో ముగ్గురు దూరం పరుగెత్తి ప్రమాదం నుంచి తప్పించుకోగా యాక్టింగ్ కోల్‌కట్టర్ శ్రీకాంత్‌పై బొగ్గు పెళ్లలు మెడపై పడడంతో గాయాలయ్యాయి. ఇతన్ని హుటాహుటిన గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే గుర్తింపు సంఘం నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం ఆసుపత్రికి చేరుకుని కార్మికున్ని పరామర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, మైన్స్ సేఫ్టీ కమిటీ సమావేశాల్లో సేఫ్టీ గురించి మాట్లాడినా.. యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన స్కూల్ బస్సు

- ముగ్గురికి తీవ్ర, ఆరుగురికి స్వల్పగాయాలు


ఘటనాస్థలంలో క్షతగాత్రులు

ముత్తారం(మంథని): మండలంలోని మైదంబండ ప్రధాన రోడ్డుపై శుక్రవారం ప్రైవేట్ స్కూల్‌బస్సు కూలీల ఆటోను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర, ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని కేసనపల్లికి చెందిన సిద్ది ఉమా, సాగర్ల కీర్తన, కందుల అఖిల, కలవేన కోమల, కొండవేన ఉమ, మానస, మల్లేశ్వరి, చొప్పరి రాధ పోతారానికి చెందిన గాడిచర్ల శంకర్ ఆటోలో రామగిరి మండలం సెవెన్ ఎల్‌బీ గనిలో మొక్కలు నాటడానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో మైదంబండ వద్ద కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను రామగిరి మండలం సెంటనరీకాలనీలోని ప్రగతి హైస్కూల్‌కు చెందిన బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. బస్ డ్రైవర్ పరారీ అయ్యాడు. కూలీలు గాయలు కావడంతో స్థానికులు ప్రైవేటు వాహనాల్లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ శంకర్, కూలీలు ఉమా, కీర్తనకు తీవ్రగాయాలు కాగా, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని ఎస్సై నరేశ్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాల బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు


దుద్దెనపల్లిలో ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకుంటున్న గ్రామస్తులు


ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు

సైదాపూర్: ప్రైవేట్ వద్దు.. గవర్నమెంట్ బడి ముద్దు అంటూ గ్రామానికి వచ్చిన ప్రైవేట్ బడి బస్సులను శుక్రవారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దుద్దెనపల్లిలో బొమ్మనపల్లి, హుజూరాబాద్, తుమ్మనపల్లి నుంచి వచ్చిన ప్రైవేట్ బడి బస్సులను మాజీ ఎంపీటీసీ చాడ చైతన్య, కొండాల్‌రెడ్డి, చిన్న వెంకటేశం ఆధ్వర్యంలో గ్రామ మహిళలు అడ్డుకున్నారు. ప్రైవేట్ పాఠశాలల మాయాజాలంలో ప్రభుత్వ బడులు మూతపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాలమైన పాఠశాల తరగతి గదులు, మైదానం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుండగా.. రూ.లక్షలు ఖర్చు చేసి ప్రైవేట్ బడికి పంపాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రైవేట్ బస్సులు గ్రామానికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రైవేట్ బడికి వెళ్తున్న విద్యార్థులను సర్కార్ బడిలో చేర్పించారు.

గూడ్స్ రైలులో చెలరేగిన మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట- బల్లార్షా సెక్షన్ల మధ్యలోని పెద్దపల్లి జిల్లా కొలనూర్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం గూడ్స్ రైలునుంచి మంటలు చెలరేగాయి. డొర్నకల్ నుంచి రాముగుండం వైపు వెళ్తుండగా ఇంజిన్ వెనక భాగంలో నాల్గో బోగినుంచి పొగమంటలు రావడంతో కొలనూర్ రైల్వేస్టేషన్‌లో లూప్‌లైనులో నిలిపివేశారు. మిగతా రైళ్లను ప్లాట్‌ఫాం, మెయిన్ లైన్ నుంచి పంపారు. డొర్నకల్ నుంచి జమ్మికుంట దాటగానే బోగినుంచి మంటలు రావడాన్ని గమనించిన లోకోపైలట్ కొలనూర్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. జమ్మికుంట ఓహెచ్‌టీఆర్డీ ఇన్‌చార్జి సాంబయ్యకు ఈ సమాచారం ఇవ్వగా, సిబ్బంది కొలనూర్ స్టేషన్‌కు చేరుకున్నారు. అప్‌లైనులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లిన తర్వాత విద్యుత్తు సరఫరాను నిలిపివేయగా పెద్దపల్లి ఫైర్‌సిబ్బంది రాంచందర్, అశీష్, శ్రీనివాస్, అనిల్ మంటలను ఆర్పివేశారు.

'పది' విద్యార్థులకు మోదీ కానుక

- 11న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో పంపిణీకి చర్యలు

కరీంనగర్‌టౌన్: ఈనెల 11న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూళ్లలో చదివే టెన్త్ క్లాస్ విద్యార్థులకు 20వేల సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్ జిల్లాలో పదో తరగతి చదివే బాలబాలికలు 3,096 మంది, రాజన్న సిరిసిల్లలో 3,841, జగిత్యాలలో 1,137, సిద్దిపేటలో 783, హన్మకొండలో 491 మంది మొత్తంగా 9348 మంది ఉన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 50సైకిళ్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఒక్కో మండలానికి వంద చొప్పున సైకిళ్లను అదనంగా పంపిణీ చేస్తారు. హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50 సైకిళ్ల చొప్పున పంపిణీ చేస్తారు. ఇక గ్రామ పంచాయతీల వారీగా 10 నుంచి 25సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. మొత్తంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 20వేల సైకిళ్లను దశలవారీగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఐదువేల సైకిళ్లు ఇప్పటికే కరీంనగర్‌కు వచ్చాయి. సైకిల్ రాడ్‌కు ఒకవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇంకోవైపు బండి సంజయ్ ఫొటో ముద్రించనున్నారు.

టెన్త్ విద్యార్థులకే ఎందుకంటే

ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుంచి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుంచి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సుల్లో వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు.

వేదపరీక్షలు.. జ్ఞాన వేదికలు


వేదాలకు సంబంధించిన ప్రత్యేక పరీక్షల్లో గురువులు, శిష్యులు


రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో స్మార్త పరీక్షలకు హాజరైన వేదపండితులు

- వేములవాడలో స్మార్తపరీక్షలు
- హాజరైన పండితులు, అభ్యర్థులు

వేములవాడ: ప్రాచీన భారతీయ విద్యా సంప్రదాయానికి జీవం పోసేలా వేదాల్లో నిపుణులైన పండితుల స్మార్త పరీక్షలు వేములవాడ రాజన్న క్షేత్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. మొదటిసారి తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు పేర్కొన్నారు. శుక్రవారం నాలుగు వేదాలకు సంబంధించిన ఈ స్మార్తపరీక్షల కోసం దేశం నలుమూలల నుంచి వేదపండితులు, విద్యార్థులు హాజరయ్యారు. పూర్వ శిష్టాచారాలను అనుసరించి, వేదభాష్యాలు, స్మృతిగ్రంథాలు, ధర్మశాస్త్ర అంశాల్లో శిక్షణ పొందిన వేదవిద్యార్థుల ప్రావీణ్యాన్ని పరీక్షించేలా ఈ కార్యక్రమం కొనసాగింది. వేద భాష్య పండితులు, అధ్యాపకులు సమగ్రంగా పరీక్షించి విద్యార్థుల విజ్ఞానాన్ని అంచనా వేస్తున్నారు. వేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో స్ఫూర్తిదాయక వేదికను రాజన్న ఆలయంలో ఏర్పాటు చేశారు. భవిష్యత్ తరాలకు ప్రాచీన భారతీయ విజ్ఞాన సంపదను అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా మండపంలో వేదవిద్యార్థులు గురువుల సమక్షంలో తమ జ్ఞానాన్ని ప్రదర్శించారు.

మొదటిసారి స్మార్త పరీక్షలు



వేద విద్యా పరంపరకు ప్రాచుర్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో స్మార్తపరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి నిర్వహిస్తోంది. నాలుగు వేదశాఖల ఆధారంగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుంచి వేద విద్యార్థులు, గురువులు, పండితులు ఈ పరీక్షల కోసం వేములవాడకు విచ్చేశారు.

– డాక్టర్ ముష్టివెంకటనాగశర్మ, తిరుపతి వేంకటేశ్వరస్వామి విశ్వవిద్యాలయం, స్మార్త విభాగం ఇన్‌చార్జి

దేశ నలుమూలల నుంచి హాజరు



దేశ నలుమూలల నుంచి వేదపండితులు, వేద విద్యార్థులు వేములవాడ రాజన్న క్షేత్రంలో జరిగే ఈ స్మార్త పరీక్షలకు హాజరుకావడం విశేషం. ఇందుకు ముందుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్, ఎమ్మెల్యే, ఆలయ ఈవోలకు అభినందనలు. చాలా మంది హాజరు కావడం గొప్ప విషయం.

– తారకరామ కుమారశర్మ, తిరుమల తిరుపతి వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు, యజుర్వేద విభాగం ఇన్‌చార్జి

సంతోషంగా ఉంది



ఈ స్మార్త పరీక్షలు వేద గ్రంథాల అధ్యయనం, ధర్మశాస్త్ర అంశాలపై ప్రావీణ్యాన్ని అంచనా వేస్తున్నాయి. అభ్యర్థులూ, పరీక్షకులూ సంప్రదాయ దుస్తుల్లో పరీక్షలలో పాల్గొనడం విశేషం. వేద విద్యార్థులకు ఇది ఎంతో ప్రాముఖ్యత గల అవకాశం. వీరందరికీ ఆలయం ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించాం.

– రాధాభాయి, ఆలయ ఈవో